## క్లుప్తంగా

### జనరిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వైద్యసిబ్బంది

భువనగిరి: తక్కువ ధరలకు లభించే జనరిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని కోరారు. సోమవారం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మురళీమోహన్, సబిత, సిబ్బంది రమాదేవి, పుష్ప, జయంతి,స్వాతి, వసుధ, సురేష్‌కుమార్, రమ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

### వాటర్ ప్లాంట్ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న ఎగమాటి రాంరెడ్డి

మోత్కూరు: మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త ఎగమాటి రాంరెడ్డి సోమవారం గ్రామస్తులకు రూ.50 వేల విరాళం చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, మండల నాయకులు పైళ్ల నర్సిరెడ్డి, వ్యాపారవేత్త బిట్ల బాబు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

### నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని కనుముకుల గ్రామంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్తలు కోట మల్లారెడ్డి పుష్పలత సోమవారం తెలిపారు. 6న శ్రీవారి తిరు కల్యాణానికి ప్రముఖ సినీనటి అంజలి హాజరు కానున్నారని తెలిపారు.

### మోత్కూరులో అన్నదానం

మోత్కూరు: మోత్కూరులోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రతివారం ఆలయంలో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తోంది. దీంట్లో భాగంగా స్థానిక ఎస్ఐ దొమ్మేటి నాగరాజు–ఉమారాణి దంపతుల సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్, సభ్యులు పట్వారి అంజయ్య, బుర్ర యాదయ్య, బయ్యని రాజు, ఉయ్యాల అంజయ్య, మర్రి ఆనందం, మత్స్యగిరి, భిక్షపతి పాల్గొన్నారు.

### రోడ్డు వెంట చెట్లకు నిప్పు

గుండాల: గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో రోడ్డు వెంట చెట్లు కాలిపోయాయి. ఈ సంఘటన గుండాల మండలంలోని సీతారాంపురం, మరిపడిగ రోడ్డు వెంట సోమవారం చోటు చేసుకుంది. బీటీ రోడ్డు వెంట గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేశారు. దీంతో ఉపాధి పథకం కింద నాటిన కొన్ని చెట్లకు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి.

### తైక్వాండోలో ముగ్గురు విద్యార్థులకు పతకాలు



పతకాలు పొందిన విద్యార్థులతో మాస్టర్ సుధాకర్, కోచ్ ఫణీంద్రకుమార్

రామన్నపేట: హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో గల కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 1, 2 తేదీల్లో జరిగిన 13వ రాష్ట్రస్థాయి ఓపెన్ తైక్వాండో పోటీల్లో రామన్నపేట మండలానికి చెందిన విద్యార్థులు సత్తా చాటి పతకాలు గెలుపొందారని సీనియర్ మాస్టర్ పట్టెడి సుధాకర్ తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తటూరు గ్రామానికి చెందిన పట్టెడి దీక్షిత్ 37కేజీల స్పారింగ్ విభాగంలో కాంస్య పతకం, బాలుర సబ్‌జూనియర్ 23కేజీల విభాగంలో రామన్నపేటకు చెందిన సాల్వేరు శ్రీజన్ కాంస్య పతకం, బాలికల జూనియర్ 45కేజీల విభాగంలో కామిశెట్టి శాన్వి రజత పతకం గెలుపొందారు. విజేతలను తైక్వాండ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.ప్రవీణ్‌కుమార్, కోచ్ ఫణీంద్రకుమార్ అభినందించారు.

### పాత పద్ధతిలోనే పది పరీక్షలు నిర్వహించాలి


ఆత్మకూరు(ఎం): పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను మధ్యాహ్న భోజన సమయంలో కాకుండా పాత పద్ధతిలోనే నిర్వహించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో ఎంఈఓ కొత్త మహదేవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్, ప్రశాంత్, వెంకటయ్య, ఆంజనేయులు, సాయికుమార్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

# అక్రమాల కట్టడికి ‘జన్‌మన్‌రేగా’

- ఉపాధి పనులు పారదర్శకంగా సాగించేలా ప్రత్యేక యాప్
- కూలీల సమస్త సమాచారం అందులోనే..
- ఎలాంటి అనుమానాలున్నా ఫిర్యాదులకూ అవకాశం
- ఆలేరు మండలంలో 6,585 జాబ్‌కార్డులు.. 13,131 మంది కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)




జన్‌మన్‌రేగా యాప్ ముఖచిత్రం

ఆలేరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు అమలు చేస్తున్న జాతీయ ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ పథకం కింద అర్హులైన పేదలకు జాబ్‌కార్డులు మంజూరు చేసి వివిధ రకాల పనులతో ఒక్కో కార్డుపై 100 రోజుల పాటు పనులు కల్పిస్తున్నారు. ఈక్రమంలో కొన్నిచోట్ల అనేక అక్రమాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. దీంతో ఉపాధిహామీలో అక్రమాలకు అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్‌రేగా పేరుతో ఒక ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. ప్రస్తుతం కేంద్రం తీసుకొచ్చిన యాప్ ద్వారా సెల్‌ఫోన్‌లోనే కూలీల వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. తద్వారా పనులు పారదర్శకంగా జరగనున్నాయి.

**యాప్‌లోనే పూర్తి సమాచారం**

మండలంలోని మొత్తం 16 గ్రామ పంచాయతీల్లో 6,585 ఉపాధి జాబ్ కార్డుదారులు ఉండగా 13,131 మంది కూలీలు ఉన్నారు. ఉపాధిపనుల్లో జరుగుతున్న అవకతవకలు, కూలీల వేతనాల్లో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర జన్‌మన్‌రే పేరుతో ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. యాప్‌ను ప్లే స్టోర్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రం, జిల్లా మండలం, గ్రామం వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. అనంతరం పేమెంట్స్ ఆప్షన్ ఎంచుకొని క్లిక్ చేస్తే పని చేసిన వివరాలు పూర్తిగా తెలుసుకోవచ్చు. ఎక్కడ పని చేశారు, పని దినాలు సంఖ్య, వేతనం, ఎంత చెల్లించారు, ఏ బ్యాంకులో డబ్బులు జమవుతున్నాయి.. లబ్ధిదారుడి ఖాతాకు ఆధార్ లింక్ ఉందా, లేదా అనే విషయాలను తెలుసుకోవచ్చు. జాబ్‌కుర్డులోని కుటుంబ సభ్యుల వివరాలు సైతం ఉంటాయి. యాప్‌పై అవగాహన ఉంటే ఎవరి పేరుపై ఎలాంటి అవకతవకలు జరిగినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు.

**మండలంలో ఉపాధి పనులు**

మండలంలోని గతేడాది నిర్వహించిన వ్యవసాయ సంబంధ పనులకే ఈ ఏడాదిలో సైతం ప్రాధాన్యత ఇచ్చారు. పొలాలకు వెళ్లేదారులకు మట్టి రోడ్డు, చెరువుల్లో పూడిక తీత, కందకాలు తవ్వకాలు, నీటి కుంటలు వంటి పనులు కల్పించారు. అయితే 2024–25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులు, పనిదినాలు పెంచుతూ 2025–26 ఏడాదికి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఈ సారి పనిదినాల సంఖ్య ఈసారి పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**యాప్‌లోనే ఫిర్యాదు చేసే అవకాశం**



ఉపాధిహామీ పథకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వం జన్‌మన్‌రేగా యాప్‌ను తీసుకొచ్చింది. పనులకు వెళ్లే జాబ్‌కార్డుదారులకు పనిదినాలు, వేతనాల చెల్లింపులు విషయంలో ఎలాంటి అనుమానాలు వచ్చిన నేరుగా యాప్ నుంచే ఫిర్యాదు చేయవచ్చు. కూలీలకు ఈయాప్‌పై పని ప్రదేశాల్లో అవగాహన కల్పిస్తాం.

– వెంకటకిషన్, ఇన్‌చార్జి ఏపీఓ, ఆలేరు

## కళాకారులకు అవకాశం కల్పించాలి



యాదగిరిగుట్ట : మాట్లాడుతున్న చెక్క వెంకటేష్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక, సాహిత్య, ధార్మిక సభల్లో ఈ ప్రాంతానికి చెందిన కళాకారులకు అవకాశం కల్పించాలని ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ కోరారు. యాదగిరిగుట్ట సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం శ్రీస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక కళాకారులకు కాకుండా, ఇతర ప్రాంతాల నుంచి కళాకారులను తీసుకొచ్చి అవకాశాలు ఇవ్వడం సమంజసంకాదన్నారు. ఆలేరు నియోజకవర్గంలో సింధు, యక్షగానం, కోలాట బృందాలు, బాగోతం, భజన, డప్పు, డోలు, హరికథలు, పంబాల కళాకారులు చాలామంది ఉన్నారన్నారు. ఈ విషయాన్ని దేవస్థానంలో గతంలో పనిచేసిన ఈఓలకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఆయా రంగాల్లో ప్రతిభ కలిగిన స్థానిక కళాకారులను గుర్తించి అవకాశం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంజ హేమలత, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్లెం కృష్ణ, మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండి జంగమ్మ, రైతు సంఘం నాయకులు పేరబోయిన బంగారి తదితరులు పాల్గొన్నారు.

### గ్రామీణ కళలను పరిరక్షించాలి

చౌటుప్పల్: పాతతరం నాటి గ్రామీణ కళలను పరిరక్షించాలని గ్రామీణ కళల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి సైదులుగౌడ్ కోరారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సోమవారం జరిగిన ఆ సమితి ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళల పరిరక్షణ ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా సమితి పట్టణ నూతన అధ్యక్షుడిగా గ్యార కిష్టయ్య, ఉపాధ్యక్షుడిగా పాశం రామరాజు, ప్రధానకార్యదర్శిగా బడుగు బాలరాజులను ఎన్నుకున్నారు. పూర్తి కార్యవర్గాన్ని ఈనెల 06న ప్రకటిస్తామన్నారు. సమావేశంలో పోలోజు శ్రీధర్‌బాబు,ఎరుకల మల్లేష్, దొడ్డి రాములు, చిట్టిప్రోలు వెంకటేశం, బొడిగె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### కనులపండువగా రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీగంగా పార్వతీ సమేత, శ్రీబస్వలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయకమిటీ చైర్మన్ ఏనుగు మహిపాల్‌రెడ్డి, బండారు ప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మునుకుంట్ల బాలచంద్రంగౌడ్, ధర్మకర్తలు వనం లక్ష్మణ్, కర్నాటి పురుషోత్తం, సిద్దగోని మహేశ్, నోముల యాదిరెడ్డి, మైసగోని మహేశ్, చంద్రయ్య,ప్రేమ్‌కుమార్, జయసూర్య, గాజుల కళావతి, యాదయ్య, అర్చకులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మదర్ డెయిరీ డైరెక్టర్ కస్తూరి పాండు, మేనేజర్ దశరథలకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి టౌన్: మదర్ డెయిరీ, విజయ డెయిరీలకు చెందిన పాల సెంటర్లకు పాలు పోస్తున్న పాడి రైతులకు పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య కోరారు. ఈ మేరకు సోమవారం భువనగిరి కలెక్టరేట్‌లో, మదర్ డెయిరీ డైరెక్టర్ కస్తూరి పాండు, మేనేజర్ పంచెద్దుల దశరథలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెయిరీల్లో పాలు పోస్తున్న రైతులకు నెలలో రెండు పర్యాయాలు ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వడం ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పాల డెయిరీల్లో నాలుగైదు నెలల నుంచి రైతులకు బిల్లుల తోపాటు బోనస్ కూడా చెల్లించకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.4 ఇన్సెంటివ్ ఇచ్చిందని.. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, చిగురుల లింగం, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, దేవి యాదగిరి పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

ఆత్మకూరు(ఎం): యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని కోఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామనర్సయ్య అన్నారు. సోమవారం ఆయన ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు(ఎం), మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు మండలాల్లో గత సీజన్‌లో 25 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు శామన్నారు. ఈ సారి 40 కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

## ఘనంగా వీడ్కోలు సమావేశం



భువనగిరి: వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న టెన్త్ విద్యార్థులు



రామన్నపేట: వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు

భువనగిరి: మండలంలోని అనాజీపురం గ్రామంలో గల దివ్యబాల విద్యాలయంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు కాట రాజులు, కరెస్పాండెంట్ కాట చిన్నప్ప, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామన్నపేట: మండలకేంద్రంలోని శ్రీహిందూ డిగ్రీ కళాశాలలో సోమవారం వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పనకంటి భాస్కర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థానాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో వైస్‌ప్రిన్సిపాల్ శ్రీదేవి అధ్యాపకులు సతీష్‌కుమార్, దేవేందర్‌రావు, డాక్టర్ తిరుపతి, రిజ్వానా, ఉదయశ్రీ, శ్వేత, సయ్యద్, సునీల్, కిరణ్ పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో యువకుడు మృతి

బీబీనగర్: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బీబీనగర్ మండల బ్రాహ్మణపల్లికి చెందిన సురకంటి అజయ్‌రెడ్డి(35) తమ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ కిందపడి ఉన్న విద్యుత్ సర్వీస్‌వైర్లు అతడి కాలుకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు తల్లి విమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**ఇసుక డంపు సీజ్**

వలిగొండ: మూసీనది పరీవాహక ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తీసుకొచ్చిన డంప్ చేసిన దాదాపు 40 టన్నుల ఇసుకను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఈ ఇసుక ఏరుపుల యాదయ్యకు చెందినదిగా గుర్తించి ఆయనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

**అధిక శబ్దం చేసే బైక్‌ల పట్టివేత**

భువనగిరి టౌన్: భువనగిరిలో ర్యాష్ డ్రైవింగ్ తోపాటు విద్యుత్ సౌండ్స్ (అధిక శబ్దం)తో హంగామా సృష్టిస్తున్న పలు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఇతర బైక్‌లను సోమవారం స్థానిక వినాయక చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాటిని సీజ్ చేయాల్సి ఉండగా వీఐపీలకు చెందినవి కావడం.. రిలీజ్ చేయాలంటూ పోలీసులకు ఫోన్లు చేస్తుండడంతో సైలెన్సర్లు తీయించి వదిలి వేశారు.

**రికార్డుల పరిశీలన**

సంస్థాన్ నారాయణపురం: మండల పరిషత్ కార్యాలయంలోని 2022–23, 2023–24 వార్షిక సంవత్సరాలకు చెందిన పలు రికార్డులును జెడ్పీ డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పలు అంశాలపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, ఎంపీఓ నర్సింహారావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

**బీమా సౌకర్యం కల్పించాలి**

బొమ్మలరామారం: అసంఘటిత రంగ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేష్ అన్నారు. బొమ్మలరామారం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణ పనుల్లో మృతి చెందిన కార్మిక కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. సమావేశంలో భారతమ్మ, సాయిలు, రాములు నగేష్, రాజప్ప, శ్రీనివాస్, పద్మ, కవిత పాల్గొన్నారు.

**ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి**

రామన్నపేట: ఈనెల 5వ తేదీ నుంచి జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.ప్రసూనాదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు ఉదయం 8.45గంటల ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. రామన్నపేట సెంటర్‌లో 315మంది ఫస్టియర్, 276మంది సెకండియర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

**వాహనాల తనిఖీ**

బీబీనగర్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి సీఐ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓయో రూమ్‌లను తనిఖీ చేశారు. లాడ్జీల నిర్వాహకులకు పలు సూచనలు చేయడంతో పాటు వాహనాదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



వెల్మజాలలో పూజలు చేస్తున్న బీర్ల అయిలయ్య

గుండాల: ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గుండాల మండలం వెల్మజాల గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శివాలయ విగ్రహ ప్రతిష్ఠాప కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట గ్రామానికి చెందిన నాయకులు రామచంద్రయ్య, దాచ ప్రసాద్, నాయకులు చిందం ప్రకాష్, బండ రాములు, సంగి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి టౌన్: జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి పంటలు ఎండిపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజ్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలోని కలెక్టరేట్‌లో ఏఓ జగన్‌కు, డీఏఓ గోపాల్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ భూగర్భజలాలు అడుగంటిపోయి యాసంగి సీజన్లో బోర్లు, వ్యవసాయ బావుల కింద సాగు చేసిన వేలాది ఎకరాలు వరి పొలాలు ఎండిపోయాయన్నారు. ఎండిన వరి పంటకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. మిర్చి, కూరగాయలు రైతులను కూడా ఆదుకోవాలన్నారు. రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో నేటికీ జమ కాకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని వాపోయారు. ఈనెలలో వరి కోతలు రానున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి జిల్లా నాయకులు మచ్చ భాస్కర్, గడ్డమీది సోములు, పాండాల మైసయ్య, రంగాకొండల్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన అన్నదమ్ములు చంద్రశేఖర్, మత్స్యగిరి ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారి కుటుంబాలను ఆదుకోవాలని వాట్సాప్ గ్రూప్‌లో కొందరు మేసేజ్ పెట్టారు. దీనికి స్పందించిన వాట్సాప్ గ్రూప్ సభ్యులు మొత్తం రూ.1.04లక్షలు సేకరించి ఆ నగదును సోమవారం మృతుల కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కర్రె పరమేష్‌తోపాటు వాట్సాప్ మిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఆరూర్‌లో..**

వలిగొండ : మండలంలోని ఆరూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సుంకిశాల పరమేశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో అతని చిన్ననాటి మిత్రులు సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి రూ.43 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలుకమర్రి నరసింహ చారి,అంబాల రమేష్, సుక్క ముత్యాలు,చాడ కృష్ణ, మర్రి అశోక్, బాసని సైదులు, సల్ల పర్వతాలు, బుర్ర నరసింహ, చిలుక మర్రి రవి కుమార్, పడిగం మహిపాల్, జోగు చంద్రశేఖర్, కసిరబోయిన సత్యనారాయణ, పైళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**మామిళ్లగూడెంలో..**

భూదాన్‌పోచంపల్లి: మామిళ్లగూడెం గ్రామానికి చెందిన ముచ్చపోతుల రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దాంతో సోమవారం జేవైజీ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు జడల యషీల్ గౌడ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఫౌండేషన్ ద్వారా రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చుక్క వంశీకృష్ణ, మాజీ వార్డు సభ్యులు పర్సమోని జ్యోతిలక్ష్మి సత్తయ్య, యాదగిరి పాల్గొన్నారు.

## విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న రమేష్



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

మోత్కూరు: విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదిగి దేశాభివృద్ధికి పాటుపడాలని విజ్ఞాన దర్శిని చైర్మన్ టి.రమేష్ అన్నారు. మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సైన్స్ సంబరాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి తనను తాను ప్రశ్నించుకోవాలని, ప్రశ్న నుంచే కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు ఉద్భవిస్తాయన్నారు. మూఢ నమ్మకాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మంటను మింగడం, మంటలను చేతిపై, శరీరంపై రాసుకోవడం, చేతిలో మంటలు మండించడం లాంటి ప్రదర్శనలు చేసి విద్యార్థులకు కనువిందు కలిగించారు. విద్యార్థులకు మానవ జీవితానికి సైన్స్ ఉపయోగం అనే అంశాలపై వ్యాస రచన, కవితల పోటీ, పాటల, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ సైంటిస్టుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పాఠశాల హెచ్‌ఎం గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞానదర్శిని ప్రతినిధులు శోభ, స్థానిక సైన్స్ ఉపాధ్యాయులు అంజయ్య, వెంకటాచారి, లింగమల్లు, శ్రీనివాస్, లలితకుమారి, కవిత, సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ**

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో సోమవారం చుక్కా లక్ష్మి బాయమ్మ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఇందులో ఇదే పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పదిలోపు ర్యాంకులు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ పసల మరియన్న, కరస్పాండెంట్ పసల విజయ తెలిపారు. మరో 150 మంది విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు.

### రేపు హుండీ లెక్కింపు

సంస్థాన్ నారాయణపురం: రాచకొండలోని శ్రీస్వయంభులింగేశ్వర స్వామి ఆలయ హుండీ ఈనెల 5 లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ చిట్టెడి వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపెద్దలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శారాజీపేట స్కూల్‌లో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు




శారాజీపేట జెడ్పీహెచ్ఎస్ స్వపరిపాలనలో..



మోత్కూరు : సాయి చైతన్య స్కూల్‌లో..

ఆలేరు రూరల్: ఆలేరు మండలం శారాజీపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 2004–2005 పదోవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకున్న పూర్వవిద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకుని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అప్పట్లో తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువులు మనోజ్‌కుమార్, పోరెడ్డి రంగయ్య, నాగేందర్, కిష్టయ్య, జంగయ్య, విద్యార్థులు ముధు,శ్రీధర్, చంద్రం, సందీప్, శివశంకర్, సురేందర్, ఉదయ్, శ్రీను, సంధ్య, జగదీశ్వరి, రూప, శీలా, దివ్య, రాజేష్, స్వామి పాల్గొన్నారు.

**ఘనంగా స్వపరిపాలన దినోత్సవం**

ఆలేరు మండలం శారాజీపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులుగా ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా వ్యవహరించి అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రణయ్, సౌమ్య, ఉష్శ్వి, రచ్చ లలిత్రామ్, మౌనిక, అభినయ, సాత్విక తదితరులు పాల్గొన్నారు.

**మోత్కూరులో..**

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సాయి చైతన్య హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులు స్వపరి పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులుగా, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి.రవీందర్‌రెడ్డి, కరస్పాండెంట్, బి.కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.